పార్టీ పదవులపై.. ఆశలు!



కామారెడ్డి, మే 1(ఆంధ్రజ్యోతి):

అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే జిల్లాలోని పలువురు సీనియర్ నేతలకు నామినేట్ పదవులను కట్టబెట్టిన విషయం తెలిసిందే. అయితే పార్టీ పదవులను సైతం భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. ప్రధానంగా క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ పదవులను శ్రేణులకు కట్టబెట్టేందుకు సిద్ధమైంది. జిల్లా, మండల, బ్లాక్ స్థాయి కమిటీలను త్వరలో నియమించనుంది. ఈ నేపథ్యంలో అధికార పార్టీలో పదవులపై పలువురు నేతలు ఆశలు పెట్టుకుంటున్నారు. కమిటీలు వేసేందుకు ఇప్పటికే ఇద్దరు అబ్జర్వర్‌లను పీసీసీ నియమించింది. మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడిన వారికే పదవుల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్ష పదవితో పాటు మండల, బ్లాక్ పదవుల కోసం పలువురు నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా నేడు కామారెడ్డి జిల్లా కేంద్రంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ఇద్దరు అబ్జర్వర్‌లతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు హాజరవనున్నారు.

అధ్యక్ష పదవుల కోసం పోటీ

కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు జిల్లా, మండల, బ్లాక్ స్థాయి కమిటీలను వేసేందుకు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లా, మండల, బ్లాక్ అధ్యక్ష పదవులపై పార్టీ క్యాడర్‌లో పోటీ నెలకొంటుంది. ప్రధానంగా జిల్లా అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందనే ఆసక్తి క్యాడర్‌లో చర్చ మొదలైంది. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలోనూ డీసీసీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పేర్కొనడంతో అందరి దృష్టి డీసీసీపై పడింది. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా కైలాస్ శ్రీనివాస్‌రావు కొనసాగుతున్నారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఈయనే కొనసాగుతూ వస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో అధ్యక్ష పీఠంపై పలువురు సీనియర్ నేతలు దృష్టి సారించారు. అదేవిధంగా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సైతం తమ అనుచర వర్గానికి డీసీసీ పదవిని కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష రేసులో పలువురు సీనియర్ నేతల పేర్లు వినిపిస్తున్నప్పటికీ సీనియర్లతో పాటు అందరిని కలుపుకుపోయే మనస్తత్వం, ఆర్థిక, అంగబలం ఉన్న నేతలకు పదవిని కట్టబెట్టాలని అధినాయకత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా అధ్యక్ష పదవికే కాకుండా ఇతర పదవులు, మండల అధ్యక్ష పదవికి సైతం పలువురు సీనియర్ నేతలు పోటీ పడుతున్నారు.

సామాజిక సమీకరణ కోణంలో..

ఎమ్మెల్యేలు గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏఐసీసీ సభ్యులు, డీసీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, నాయకుల విస్తృత అభిప్రాయాలను పరిశీలకులు సేకరించి జాబితాను రూపొందించనున్నారు. చివరికి తుది జాబితాను పీసీసీకి నివేదిస్తారు. సామాజిక సమీకరణాలు, నాయకుల సమర్థత, సీనియార్టీ, నియోజకవర్గాలు, ఆయా బ్లాక్, జిల్లాలో పరిస్థితులు, పార్టీ బలోపేతానికి ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పదవులను భర్తీ చేయనున్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లాలోని ముఖ్య నాయకులు పదవులను దక్కించుకునేందుకు జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తంగా పార్టీ సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణుల్లో సందడి మొదలైంది.

- అధికార కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత సందడి
- త్వరలో జిల్లా, మండల, బ్లాక్ కమిటీలను నియమించే అవకాశం
- అధ్యక్ష పదవులపై పలువురు సీనియర్ల దృష్టి
- పదవుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసిన నేతలు
- మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికే ప్రాధాన్యత
- సీనియర్లతో పాటు మహిళలు, యువతకు అవకాశాలు
- నేడు కామారెడ్డిలో కాంగ్రెస్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం
- హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు

మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికే ప్రాధాన్యత

జిల్లా, మండల, బ్లాక్ స్థాయి కమిటీలను నియమించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం ఈసారి కొన్ని నిబంధనలు పెట్టింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి సంస్థాగత ఎన్నికల్లో నిబంధనల ప్రకారం మొదటి నుంచి పార్టీలో పని చేస్తున్న వారికే పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించింది. ప్రతిపక్షంలో ఉండి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని నేతలు సూచిస్తున్నారు. ఈ విషయంలో ఖచ్చితంగా అమలు చేయాలని పీసీసీ స్పష్టంగా ఆదేశించింది. దీంతో సీనియర్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొత్తవారు పార్టీలో చేరి పెత్తనం చెలాయిస్తున్నారని తామేమి చేయాలని ఆందోళన చెందుతున్న సీనియర్‌లకు ఈ నిర్ణయం సంతోషాన్ని కల్పిస్తోంది. మండల, బ్లాక్, గ్రామ కమిటీల్లో సీనియర్‌లకు ప్రాధాన్యత పెరుగుతుందని భావిస్తున్నారు. కీలక పదవులు సీనియర్‌లకు దక్కే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రతిపక్షాల్లో ఉండి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పదేళ్ల పార్టీ కోసం పని చేసిన నేతలకు పదవులు దక్కేలా చూడాలని ఇందుకు రాష్ట్రస్థాయి నేతలు, ప్రజాప్రతినిధులు గుర్తించాలని కోరుతున్నారు.

నేడు జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం

అధికార కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా జిల్లా, మండల, బూత్ స్థాయి సమావేశాలను నిర్వహించాలని ఇది వరకే నిర్ణయించింది. సమావేశాలతో పాటు కొత్త కమిటీలను ఏర్పాటు చేసేందుకు టీపీసీసీ జిల్లాకు ఇద్దరు అబ్జర్వర్‌లను వేణుగోపాల్ యాదవ్, సత్యనారాయణగౌడ్‌లను నియమించింది. వీరు ఆయా సమావేశాలకు హాజరై కాంగ్రెస్ శ్రేణుల అభిప్రాయాలు సేకరించి కమిటీల జాబితాను తయారు చేసి టీపీసీసీకి నివేదించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శుభం ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం జిల్లా స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి అబ్జర్వర్‌లతో పాటు ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, సీనియర్ నేత ఏనుగు రవీందర్‌రెడ్డితో పాటు జిల్లా, మండల, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు.



కామారెడ్డిలో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఘనంగా మే డే వేడుకలు

కామారెడ్డి టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): మే డే సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక మతోన్మాద రాజకీయాలు చేస్తుందని కార్మికులను, కర్షకులను కులాల పేరు మీద విభజించి కార్మికుల హక్కులను నాశనం చేస్తు కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం కొత్త చట్టాలను తీసుకువచ్చిందని అన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని కార్మిక హక్కులను రద్దు చేసి కొత్త 4 లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మిక ద్రోహమని అన్నారు. వీటికి నిరసనగా మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. దేశంలో 47 కోట్ల మంది శ్రమజీవుల్లో కేవలం ఏడు కోట్ల మంది కార్మికులకు మాత్రమే ఉద్యోగ భద్రత తగిన వేతనాలతో జీవిస్తున్నారని మిగిత వారు బతుకు భద్రత లేక కొట్టుమిట్టాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం, కోర్టుల గురించి గొప్పలు వల్లించే కేంద్రం సమాన పనికి సమాన వేతనం అనే సుప్రీంకోర్టు తీర్పును ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌ల నిలుపుదల కోసం మే 20న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరుణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బాలరాజు, సీనియర్ నాయకుడు వీఎల్ నర్సింహారెడ్డి, రాజనర్సు, ప్రభాకర్, మహబూబ్, సంతోష్, ప్రవీణ్, ప్రభు, దీవెన పాల్గొన్నారు.



.. సీపీఐ నాయకులు

బిచ్కుంద న్యాయాధికారిగా వినిల్ కుమార్

బిచ్కుంద, మే 1(ఆంధ్రజ్యోతి): బిచ్కుంద జూనియర్ న్యాయాధికారిగా జాడ వినిల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. దీంతో న్యాయవాదులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్‌పటేల్, జనరల్ సెక్రెటరీ శివాజీ, ఉపాధ్యక్షుడు దేశ్‌ముఖ్, ట్రెజరర్ విఠల్, న్యాయవాదులు మల్లేశ్వర్, షేక్‌మహ్మద్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు చేరని ఇందిరమ్మ ఇళ్ల పథకం

- పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో సైతం పత్తా లేని పనులు
- ఆశగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- రాములగుట్ట తండాకు 47 ఇళ్లకు అనుమతులు
- అవగాహన కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం



7

నర్వ పాత చెరువు కాల్వకు బుంగలు



- సైడ్‌వాల్ ధ్వంసం కావడంతో నీరు వృథా
- మరమ్మతులు చేయాలంటున్న రైతులు

7

మాచారెడ్డిలో కొనుగోలు కేంద్రాల ప్రారంభం

మాచారెడ్డి, మే 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయాలని రైతులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. దీంతో సొసైటీ, సివిల్ సప్లయ్ అధికారులు స్పందించి గురువారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి తూకం వేశారు. రైతులు వరి ధాన్యం కాంటా చేసి రైస్‌మిల్లులకు తరలించినట్లు సొసైటీ, సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 19 లారీల వరి ధాన్యం బస్తాలు రైస్ మిల్లులకు తరలించామని తెలిపారు. మహారాష్ట్ర నుంచి కూలీలను రప్పించా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారి రాంమోహన్, సివిల్ సప్లయ్ అధికారి మల్లికార్జున్‌బాబు, అసిస్టెంట్ సివిల్ సప్లయ్ అధికారి నరసింహ, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, మానిటరింగ్ అధికారి అమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



మాచారెడ్డిలో ధాన్యం తూకం వేస్తున్న అధికారులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే తోట



ప్రజలతో మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

జుక్కల్, మే 5 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజకవర్గం ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. గురువారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. గురువారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన ప్రజలతో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు ఏమన్నా సమస్యలు ఉంటే క్యాంప్ ఆఫీస్‌కి వచ్చి సమస్యను తన దృష్టి తెచ్చి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. బిచ్కుంద మండలం పత్లాపూర్ యాదవ కులస్తులు తమ గ్రామంలో బీరప్ప పండుగ నిర్వహిస్తున్నామని తమ గ్రామానికి నెల 5వ తేదీన బీరప్ప పండుగకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని గ్రామస్థులు ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా ఎమ్మెల్యే స్పందించి వస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్ గ్రామస్థులు పాల్గొన్నారు.



నసురుల్లాబాద్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

- ఎస్పీ రాజేష్‌చంద్ర

నసురుల్లాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ని పోలీసుస్టేషన్‌ని గురువారం ఎస్పీ రాజేష్‌చంద్ర తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్‌లో గల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు నేరాల నియంత్రణకు కృషి చేయాలని అన్నారు. ఆయన వెంట బిచ్కుంద సీఐ నరేష్, నసురుల్లాబాద్ ఎస్సై లావణ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అథ్లెటిక్స్ సమ్మర్ క్యాంపు ప్రారంభం



రాజంపేటలో అథ్లెటిక్స్ సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న దృశ్యం

రాజంపేట, మే 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మొదటి రోజు సమ్మర్ క్యాంపు ప్రారంభించినట్లు ఎంఈవో పూర్ణచంద్రరావు తెలిపారు. ఈనెల 15న అథ్లెటిక్స్ కోచింగ్ సమ్మర్ క్యాంపు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జైపాల్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ అనిల్‌కుమార్, హెచ్ఎం ఈశ్వరయ్య, టీజీపీఈటీఏ జిల్లా ప్రెసిడెంట్, పీడీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు అమ్మితే కఠిన చర్యలు

బిచ్కుంద, మే 1 (ఆంధ్రజ్యోతి): కల్తీకల్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్సై నాగేష్ అన్నారు. గురువారం కల్లు విక్రయ దుకాణాల్లో అల్ప్రాజోలం, డైజోఫాం తాగడం వల్ల కలిగే నష్టాలపై వివరించే పోస్టర్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, కల్తీకల్లు పూర్తిగా నిర్మూలన కోసం ప్రజల సహకారం అవసరమన్నారు. మత్తుపదార్థాల విక్రయాలకు ఎవరైన పాల్పడితే వెంటనే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని వివరించారు.

భూ భారతిలో ఫిర్యాదుల వెల్లువ

- అత్యధికంగా అసైన్డ్ దరఖాస్తులు 1600
- కొత్త పట్టా పాసు పుస్తకాల దరఖాస్తులు 1320
- దరఖాస్తుల పరిశీలనకు 9 బృందాల ఏర్పాటు, ప్రతీ బృందానికి 400 దరఖాస్తుల పరిశీలన
- లింగంపేట మండలంలోని శెట్పల్లి సంగారెడ్డిలో అత్యధికంగా 910 దరఖాస్తులు

లింగంపేట, మే 1 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలో రాష్ట్రంలోనే అత్యధిక భూ సమస్యలు ఉండడంతో భూ భారతి పైలెట్ ప్రాజెక్టు మండలంగా ఎంపిక చేశారు. రైతులు ప్రతీరోజు తహసీల్ కార్యాలయం, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విసిగిపోయిన రైతులకు ఇటీవల శెట్పల్లిలో నిర్వహించిన రైతు సదస్సుకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరై రైతుల భూ సమస్యలను, భూ భారతి చట్టం ద్వారా 100 శాతం పూర్తి చేస్తామని చెప్పారు. దీంతో 10 సంవత్సరాలుగా భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లింగంపేట మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అత్యధికంగా అసైన్డ్ భూముల సమస్యలు, కొత్త పట్టా పాసు పుస్తకాల సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ స్థానంలో ఇటీవల తీసుకు వచ్చిన భూ భారతి చట్టాన్ని అమలు చేయడానికి లింగంపేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు మండలంగా ఎంపిక చేసి ఈనెల 17 నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభించారు. సదస్సులు ఈ నెల 30తో ముగిశాయి.

23 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు

భూ భారతి పైలెట్ మండలంగా ఎంపికైన లింగంపేట మండలంలో రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి రోజుకు రెండు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తూ భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటూ వచ్చారు. ఇలా మండలంలోని 23 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా మొత్తం 3,702 దరఖాస్తులు వచ్చాయి. అన్ని గ్రామాల్లో అసైన్డ్, కొత్త పట్టా పాసుపుస్తకాల సమస్యలతో పాటు సదా బైనామాలు, అటవీ భూములకు సంబంధించిన సమస్యలే అధికంగా ఉన్నాయి. మండలంలో అత్యధికంగా శెట్పల్లి సంగారెడ్డి రెవెన్యూ గ్రామంలో 910 దరఖాస్తులు వచ్చాయి.

471 కొత్త పట్టా పాసు పుస్తకాల సమస్యల దరఖాస్తులు

లింగంపేట మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సులో ఎక్కువగా అసైన్ భూములకు, పీపీబీ భూముల సమస్యలే ఎక్కువగా వచ్చాయి. నిబంధనల ప్రకారం అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు, ఇనామ్ భూములు, దేవాలయ భూములు కొనడానికి వీలు లేదు కానీ చాలా చోట్ల ఇతరుల చేతుల్లోకి మారాయి. వాటిని కొనుగోలు చేసిన రెతులు తమకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో అసైన్డ్ భూములకు 1600 దరఖాస్తులు రాగా కొత్త పట్టా పాసు పుస్తకాల కోసం 1320, పీవోటీ దరఖాస్తులు 490,



శెట్పల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

అటవీ, రెవెన్యూ భూముల హద్దుల సమస్యలకు 440 దరఖాస్తులు, సాదా బైనామాలకు సంబంధించి 300 దరఖాస్తులు, భుముల కొలతలకు సంబంధించి 120 దరఖాస్తులు వచ్చాయి. ఇలా మొత్తం 3702 దరఖాస్తులు వచ్చాయి.

గ్రామాల వారీగా దరఖాస్తుల వివరాలు

మండలంలోని పోతాయిపల్లిలో 260, బోనాల్ 47, బాయంపల్లి 86, కన్నాపూర్ 79, పర్మల్ల 173, పొల్కంపేట 165, ఎల్లారం 83. మెంగారం 81, జల్దిపల్లి 18, రాంపూర్ 88, లింగంపల్లి (ఖుర్దు) 261, కోర్పోల్ 75, లింగంపేట 139, భవానిపేట 232, ముంబాజీపేట 280, కంచుమల్ 72, కొండాపూర్ 122, నల్లమడుగు 99, నాగారం 55, శెట్పల్లి సంగారెడ్డి 910, శెట్పల్లి 103, బానాపూర్ 101, మోతె 173 దరఖాస్తులు వచ్చాయి.

దరఖాస్తుల పరిశీలన

లింగంపేట మండలంలో రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను గురువారం నుంచి పరిశీలించి విచారణ చేపట్టనున్నారు. విచారణకు 9 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో తహసీల్దార్, డీటీ, సీనియర్ అసిస్టెంట్, సర్వేయర్లను నియమించారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఒక్కో బృందానికి 400 దరఖాస్తులను కేటాయించి ఆ బృందం పరిశీలించి విచారణ చేపట్టనున్నారు. నిబంధనల ప్రకారం అనువుగా ఉన్న దరఖాస్తులకు అనుమతులు ఇవ్వనున్నారు.

వచ్చిన దరఖాస్తులకు పరిష్కరిస్తాం

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



భూ భారతి పైలెట్ ప్రాజెక్టు కింద లింగంపేట మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 3702 దరఖాస్తులు వచ్చాయి. చట్టం నియమ నిబంధనల మేరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి విచారణ చేపడతాం. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దరఖాస్తులను విచారించనున్నాం. నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి నిబంధనల మేరకు నడుచుకుంటాం. దరఖాస్తులు చేసుకున్న వారికి నోటీసులు జారీ చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తాం.


బోధన్‌లో మేడే కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్


ఆర్మూర్‌టౌన్‌లో..


యానం గుట్టవద్ద జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు


మేడే జెండాను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్టీయు యూనియన్ నాయకులు

జిల్లా అంతటా ఘనంగా మేడే వేడుకలు

బోధన్‌రూరల్,మే1(ఆంధ్రజ్యోతి): బోధన్‌లో గురువారం మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ 139సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాగో నగరంలో కార్మిక వర్గం రక్తదర్పణం చేసి 8గంటల పనిదినాన్ని సాధిస్తే నేటి పెట్టుబడిదారి వర్గాలు 10గంటలు, 13గంటలు కార్మికులు పని చేయాలంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, దేశ పాలకులు ఏకంగా చట్టాలనే మార్చివేసి అమలు చేయుటకు పూనుకుంటున్నారని మండిపడ్డారు. చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికులను కట్టు బానిసలుగా మార్చివేసే విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. కార్మిక వర్గానికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ రంగంలోనే కార్మికులు అతి తక్కువ వేతనాలకు పని చేస్తూ వెట్టి చాకిరి గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కుమారస్వామి, ఏశాల గంగాధర్, మల్లేష్, గంగాధర్, గోపి, ప్రభాకర్, దేవదాస్, సంజయ్, మాధవి, పార్వతి, లక్ష్మణ్, శంకర్, నాగమణి, గంగామణి, లక్ష్మి, సీతారాం,కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో కార్మికుల హక్కులకై పోరాడుదాం

చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో కార్మికుల హక్కులకై పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు పుట్ట వరదయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు సాయాగౌడ్, లక్ష్మణ్ గౌడ్, మేకల వినోద్, గీత కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్ గౌడ్,నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నవీపేట: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు.నవీపేట,ఫకీరాబాద్‌లలో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడి శ్రీనివాస్ ఉన్నారు.

మోర్తాడ్:మండల కేంద్రంలో గురువారం మాస్‌లైన్ ప్రజాపంతా ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ప్రజాపంతా జిల్లా నాయకులు కిషన్ ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కిషన్, దశరత్, శ్రీను, గజానంద్, నాగలక్ష్మి, గంగు, రాజు, రాజన్న, సురేందర్, రవి, ముత్తెన్న, నర్సయ్య, గంగాధర్, రాజేశ్వర్, గంగారాం, పోశన్న పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం 139వ మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎడపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయం ఎదుట సీఐటీయూ జెండాను సీఐటీయూ మండల కన్వీనర్ జంగం గంగాధర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు పద్మక్క, కార్యదర్శి సంతోష్‌కుమార్, భూమవ్వ, గంగాధర్, వసంత్, నాగరాజు,సులోచన,భూదేవి, ప్రవీణ్, లింగం పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలో సీపీఐ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో గురువారం 139వ మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కోటగిరి బస్టాండ్ ఆవరణలో సీపీఐ పార్టీ జెండాను సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షులు గంగాధర్, గీత పనివారాల సంఘం అధ్యక్షులు వెంకట్ గౌడ్, కొత్తపల్లి విండో అధ్యక్షులు సునీల్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దూద నాయక్, మేదరి శివ, శరత్, శంకర్,అన్వర్, ఇమ్రాన్, పవన్, సంజీవ్, దత్తు పాల్గొన్నారు.

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని ప్రగతిశీల బీడి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎం. ముత్తెన్న మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బి. దేవరాం, బి. కిషన్, రాజేశ్వర్, సత్తెక్క, అరవింద్, శ్రీనివాస్, నజీర్, పద్మ, లక్ష్మి, సునిత, కార్మికులు పాల్గొన్నారు. 1104 యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని జిరాయత్ నగర్ విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద 1104 యూనియన్ ఆధ్వర్యంలో మేడే సంబురాలను విద్యుత్ కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ యూనియన్‌నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రెంజల్: ప్రపంచ 139వ మేడే వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. తాడ్‌బిలోలి గ్రామంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఎర్రజెండాను ఎగురవేసి మేడే వేడుకలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు పార్వతి రాజేశ్వర్, పుట్టి నాగన్న, నసీర్, పోశెట్టి, పెద్దులు, ఒడ్డెన్న, సాయిలు, వివిధ పార్టీల నాయకులు సాయిరెడ్డి, మొగులనా, శ్రీనివాస్, అనంత్ రావు, ఖుద్దుస్, ప్రసాద్, యోగేష్, సురేష్, అన్వర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్, మే1 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఐక్యంగా జరుపుకునే వేడుకైన మేడేను జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించారు. కార్మి కులకు ఐక్యంగా పోరాడి మేడే ఉద్యమ స్ఫూర్తిని నింపుకొని ముందుకు సాగాలని వివిధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏఐటీయుసీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కళాశాల, గ్యాస్ ఏజెన్సీ వర్కర్స్ యూనియన్, వ్యవసాయ మార్కెట్ యార్డు సివిల్ సప్లయి కార్పొరేషన్ హమాలీ యూనియన్, కూరగాయల అమ్మకందారుల సంఘం, గాంధీగంజ్, కిషన్‌గంజ్, మదీనామార్కెట్, బోధన్ బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, అంబేద్కర్ కాలనీ, విఠలేశ్వర్ కాలనీలో నిర్వహించిన వేడుకల్లో మేడే జెండాను నాయకులు ఆవిష్కరించారు. నాయకులు, కార్మికులకు పెద్ద ఎత్తున ర్యాలీగా రైల్వేస్టేషన్ వరకు మహాప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, సీనియర్ నాయకులు భూమయ్య, ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షులు చక్రపాణి, కార్యదర్శి హన్మాండ్లు, నాయకులు రాధకుమార్, స్వరూప, స్వప్న, సాయన్న, పరశురాం, దేవేందర్, మోహన్, గంగాధర్, ఇమ్రాన్‌అలీ, ఫిరోజ్, సురేష్, వివిధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మేడే వేడుకల్లో మేడు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ కార్మిక వర్గం 8గంటల పనితోపాటు తమ హక్కుల సాధనకోసం పోరాడి తెచ్చుకున్నదే మేడే వేడుకలు అని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గం హక్కుల సాధన కోసం ప్రతిజ్ఞ చేసుకుని మేడే ఉత్సవాన్ని ఘనంగా జరుపుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యురాలు నూర్జహాన్, సుజాత, ఆనంద్, రాములు, రఫీక్, అంజయ్య, ఉద్ధవ్, స్వర్ణ, దినేష్, పాల్గొన్నారు.

సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో:జిల్లా కేంద్రంలోని సీపీఐఎంఎల్ పార్టీ కార్యాలయంలో గురువారం మేడే ను పురస్కరించుకొని జెండా ఆవిష్కరించారు. కుమార్‌నారాయణ భవన్ వద్ద సంయుక్త జిల్లా కార్యదర్శి ప్రభాకర్ జెండాను ఆవిష్కరించారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో నాయకులు జెండాను ఎగురవేసి ఉరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్, దేవరాం, ఠాకూర్, రాజన్న, టీయుసీఐ జిల్లా కార్యదర్శి ముత్తెన్న, గంగన్న, రమేష్, శేఖర్, పద్మలక్ష్మి, సునీత, గంగాధర్, అనిల్, అరవింద్, శ్రీనివాస్, నజీర్, మమత, లింబాద్రి, నిఖిల్, గంగాధర్ పాల్గొన్నారు.

టీయుసీఐ ఆధ్వర్యంలో:139వ మేడే వేడుకను ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయుసీఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ధర్నా చౌక్ మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుధాకర్, వెంకన్న, కిరణ్, రవి, విఠల్, లింగం, రాజేశ్వర్, గోవర్ధన్, రాములు, సుజాత, యాదమ్మ, శివకుమార్, శాంతికుమార్, పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి గణేస్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబా, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రిటైల్ బట్టల గుమస్తా సంఘం ఆధ్వర్యంలో:అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని రిటైల్ బట్టల గుమస్తా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాలలో రోగులకు పండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో రాజు,శ్రీనివాస్,నరేష్,లక్ష్మణ్, రాజు, సత్యదేవ్, గంగాధర్, పాల్గొన్నారు.

● సీపీఐ ఆధ్వర్యంలో మేడే

భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో మేడే వేడుకలను కార్యాలయంలో నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్ర మంలో నగర కార్యదర్శి ఓమయ్య, రఘు, అలీ, ఇమ్రాన్, ఫిరోజ్, అంజలి, దేవేందర్, రాధాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● 8గంటల పనివిధానంకై మేడే స్ఫూర్తితో ఉద్యమిద్దాం

మేడే స్ఫూర్తితో కార్మికులకు 8గంటల పనివిధానానికై ఉద్యమించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయు కార్యాలయంలో మేడే ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్య క్షుడు ఆనంద్, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రాజ్, కోశాధికారి స్వర్ణ, ఆశ యూనియన్ జిల్లా నాయకులు రేణుకసుకన్య, నగేష్, గంగాధర్, మురళీధర్, మహేష్, ఆటో యూనియన్ నాయకులు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ రూరల్: పట్టణంలోని సీపీఎం ప్రజాసం ఘాల ఆధ్వర్యంలో గురువారం మేడే సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యాలయం వద్ద , యానం గుట్టవద్ద తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్, సీఐటీయు కార్యాలయం వద్ద సుజాత, సబ్‌రిజిస్టర్ కార్యాలయం ముందు కుల్దీప్ శర్మ, అంబేద్కర్ చౌరస్తా వద్ద కుతాడి ఎల్లయ్య, మామిడిపల్లిలో డివిజన్ కమిటి సభ్యులు టి. భూమన్నలు కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొర్ర నాగరాజు, సాయిలు, కల్లుబాయి, లింబాద్రి, రవి,గంగనర్సయ్య, లక్ష్మి, సవిత రాణి, ప్రతీభ, అరుంధతి, లలిత,సరస్వతి,జగదాంబ,నరహరి,కార్మికులు పాల్గొన్నారు.

ఆలూర్: నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండలం మిర్ధాపల్లి, మచ్చర్ల గ్రామాలలో గురువారం మేడే జెండా ను ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మిర్ధాపల్లి గ్రామంలో ఐఎఫ్టీయు ఆధ్వర్యంలో బీడీ కార్మికులు జెండాను ఆవిష్కరించారు. ఆలూర్ మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ వర్కర్స్ మేడే జెండాను ఆవిష్కరించారు. మచ్చర్ల గ్రామంలో ఐఎఫ్‌టీయు నాయకులు జెండాను ఆవిష్కరించారు.

ముప్కాల్:139వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం ముప్కాల్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఎనిమిది గంటల పనిదినం సాధించుకుందామని మేడే ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు అమీనా, వసంత, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం మేడే వేడుకలను పంచాయితీ కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. జక్రాన్‌పల్లిలో మేడే జెండాను పంచాయితీ కార్మికులు ఆవిష్కరించారు. అనంతరం మేడే సంబురాలను పంచాయితీ కార్మికులు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:ప్రపంచ కార్మిక కర్షకుల దినోత్సవం మే డేను కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ అధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీయుసీఐ జిల్లా ఉపాధ్యక్షురాలు వి. సత్తెమ్మ మండల నాయకులు వి. బాలయ్య, బి అశోక్, టి బాలకిషన్, టిబాలయ్య, వి. అశోక్, గంగాధర్, పెద్ది రాజేశ్వర్, ఎన్. మల్లయ్య, పంచాయితి కార్మికులు పాల్గొన్నారు.

పెర్కిట్:ఆర్మూర్ పట్టణంలోని భారత కమ్యునిస్టు పార్టీ ఆధ్వర్యంలో 139వ మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా నాయకులు ఆరెపల్లి సాయిలు ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో గురువారం జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మౌలాన, సోమశీను, సభ్యులు ఫిరోజ్, శ్రీకాంత్, రహీం, పరశురాం, రాజేందర్, మల్లయ్య పాల్గొన్నారు.

మాక్లూర్: మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఐఎంఎల్ డిపో వద్ద గురువారం జెండా ఎగురువేసి ఘనంగా మేడే ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎల్ డిపో సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: ప్రపంచ కార్మిక దినం మేడేను పురస్కరించుకొని పట్టణ కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ముందు ప్రాజెక్టు అధ్యక్షురాలు దేవగంగు ఆధ్వర్యంలో కార్మిక జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ప్రమీల, గంగలక్ష్మి, జ్యోతి, మంజుల, యమునా, బాగ్య, వసంత, స్వరూప, జయంతి, అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: గత 15 సంవత్సరాలుగా సానిటేషన్ విభాగంలో సేవలు చేసిన మున్సిపల్ కార్మికులను మేడే సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ సాయిబాబాగౌడ్, మున్సి పల్ మాజీ వైస్ చైర్మన్ లింగాగౌడ్, ఖాందే శ్రీనివాస్, సానిటరి అధికారి గజానంద్, కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ సత్యం, మక్కుల సాయినాధ్, జంబిహనుమాన్ కమిటి మాజీ చైర్మన్ చౌకే లింగం, జిరాయత్‌నగర్ హనుమాన్ మందిర్ అభివృద్ధి కమిటి అధ్యక్షుడు అంబల్ల తిరుపతి, కార్యదర్శి నూకల శేఖర్, సభ్యులు విఠోభ శేఖర్, జిందం నరహరి, భాస్కర్ పాల్గొన్నారు.

వేల్పూర్:మండలం ఆధ్వర్యంలో ఘనంగా మేడే కార్యక్రమాన్ని గురు వారం నిర్వ హించారు.ఈకార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నాయకులు బండి పోశన్న, అనంత్, ఎన్. గంగాధర్, నర్సయ్య, బాబురావు, భాగ్య, రాజన్న, భూమన్న, రాజన్న, తదితులున్నారు.


మాదాపూర్‌లో జెండా ఎగురవేస్తున్న దృశ్యం


కమ్మర్‌పల్లిలో..


భీమ్‌గల్‌లో..


ఆర్మూర్‌లో మున్సిపల్ కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోటగిరి,మే1(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ బాలుర కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ మొబిన్ తెలిపారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ ఇంగ్లీష్ మీడియంలలో మైనారిటీలకు 60సీట్లు, మైనారిటీయేతరులకు 40సీట్లు రిజర్వ్ చేయబడ్డాయన్నారు. 2025లో ఎస్సెస్సీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ కళాశాలలో ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.ఏవైనాసందేహలు ఉంటే మొబైల్ నెంబర్ 915436 5020, 9493040786కు సంప్రదించాలని ఆయన సూచించారు.

'పది' విద్యార్థులకు సన్మానం

నవీపేట,మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థులను గురువారం పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు ఘనంగా సన్మానించారు. గత మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను బుధవారం విడుదల చేయగా పాఠశాలకు చెందిన విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది, స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు.

యంచ రైస్‌మిల్లులో ఇసుక టిప్పర్లకు తూకం

నవీపేట,మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ రైస్‌మిల్లులోని ధర్మకాంటాలో గురువారం ఇసుక టిప్పర్లకు తూకం నిర్వహించారు. సుమారు 15ఇసుక టిప్పర్లను స్థానిక రైస్‌మిల్లులో ఉన్న ధర్మకాంటాకు తరలించి అందులో తూకం వేశారని పేర్కొంటూ పలువురు సంబంధిత ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ వెంకట రమణ, ఎస్ఐ వినయ్‌లను వివరణ కోరగా సంబంధిత ఇసుక టిప్పర్లు బోధన్ మండలం సిద్దాపూర్ నుంచి బాసర రైల్వే బ్రిడ్జి పనుల కోసం వేబిల్లుల అనుమతితో వెళ్తున్నాయని అన్నారు. ఇసుక పరిమాణాన్ని కొలమానం కోసం రైస్‌మిల్లు వద్ద ఉన్న ధర్మకాంటా వద్ద వారు తూకం వేసి ఉంటారని తహసీల్దార్, ఎస్ఐలు వివరించారు.

ఏఐడబ్ల్యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామనాథం

బాల్కొండ, మే 1(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం వన్నెల్(బి)కి చెందిన రాజుల రామనాథం తెలంగాణ రాష్ట్ర ఏఐడబ్ల్యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జాతీయ వినియోగదారుల సమాఖ్య ఏఐడబ్ల్యూసీ చైర్మన్ విఖ్యాత్ పెనాయ్‌జనరల్ సెక్రటరీ దేవేంద్ర తివారిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఖేలో ఇండియా సెపక్‌తక్రాకు జిల్లా క్రీడాకారులు

సుభాష్‌నగర్, మే1 (ఆంధ్రజ్యోతి):ఖేలో ఇండియా నిర్వహించనున్న సెపక్‌తక్రా జాతీయ స్థాయి క్రీడలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు సెపక్‌తక్రా జిల్లా అసోసియేషన్ కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాదారి సంజీవ్‌రెడ్డి తెలిపారు. మే 4 నుంచి బిహార్‌లోని పాట్నా రాష్ట్రంలో జరిగే అండర్-18 సెపక్‌తక్రా పోటీలకు బాలుర విభాగంలో సాత్విక్‌రెడ్డి, బాలికల విభాగంలో నల్లభవ్యశ్రీలు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియాకు ఎంపిక కావడం పట్ల అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలి: ఏసీపీ

బోధన్‌రూరల్,మే1(ఆంధ్రజ్యోతి): జీవితంలో ఏదైనా సాధించాలంటే ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని అప్పుడే విజయం సాధించవచ్చని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని విజయసాయి పాఠశాలలో పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఆయన అభినందించారు. విజయసాయిలో 10వ తరగతిలో 417మంది విద్యార్థులు ఉండగా అందరు విద్యార్థులు ఉత్తీర్ణులు అవ్వడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆర్మూర్ టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి) :మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చెందిన సయ్యద్ జాఫర్ (42) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. సయ్యద్ జాఫర్ మద్యానికి బానిసై జీవితం పై విరక్తి చెంది గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో బుధవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఆయన తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

కోటగిరి,మే1(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామానికి చెందిన సంజీవ్(42)అనే వ్యక్తి మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. సంజీవ్‌కు ఇద్దరు భార్యలు కాగా మొదటి భార్యకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెండవ భార్య భర్తకు దూరంగా ఉంటుంది. సంజీవ్ గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరచు ఇంట్లో మొదటి భార్య పిల్లలను వేధించేవాడన్నారు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటిపైకప్పులో కర్రకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

విద్యుత్ భద్రత వారోత్సవాలు

సుభాష్‌నగర్, మే1 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు భద్రతా చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ డివిజనల్ ఇంజనీర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పవర్‌హౌజ్ కంపౌండ్ కార్యాలయంలో గురువారం విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ వైర్లను సరిచేసేటప్పుడు చేతికి గ్లౌజ్ వేసుకోవాలన్నారు. ఈ వారోత్సవాలు మే 1 నుంచి 7వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అనంతరం విద్యుత్ భద్రత వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, టౌన్1 ఏఈ నాగేష్, టౌన్6 ఏఈ ఎంఏ రాఫూఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్ టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి) :మండలంలోని చేపూర్ గ్రామానికి చెందిన ముత్యాల సుష్మ (47) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. సుష్మ మానసిక స్థితి బాగలేక ఆసుపత్రిలో చికిత్స చేయించిన నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై పురుగులు మందు తాగగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గుర్తుతెలియని శవం లభ్యం

మోపాల్, మే1 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కాల్పోల్ అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని శవం కుళ్లిపోయి ఉన్నట్లు గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మహిళ శవం కుళ్లిపోయినట్లు స్థానికులు గుర్తించారు. దట్టమైన అటవీప్రాంతం ఉండటంతో పోలీసులు ఎవరూ అక్కడ సంఘటన స్థలానికి చేరుకోలేదు. ఈ శవం మోపాల్ పోలీస్ స్టేషన్ లేక వర్ని పోలీస్ స్టేషన్‌కు వస్తుందా అని పోలీసులు అయోమయంలో ఉన్నారు. రాత్రి కావడంతో సంఘటన స్థలానికి ఎవరూ వెళ్లలేదు. ఈ విషయాన్ని మోపాల్ ఎస్సై యాదగిరిని అడుగగా ఇప్పటి వరకు తమకు ఎవరూ ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఫారెస్టు అధికారులు మాత్రం తమకు సమాచారం అందించినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం సంఘటన స్థలానికి వెళ్తున్నట్లు తెలిపారు.

ముదక్‌పల్లి గ్రామాన్ని సందర్శించిన డీపీవో

మోపాల్,మే1(ఆంధ్రజ్యోతి):మండలంలోని ముదక్‌పల్లి గ్రామాన్ని గురువారం జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి శ్రీనివాస్ సందర్శించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో ఉన్న నర్సరీలను పరిశీలించి ఎండాకాలంలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులు ఉన్నారు.

అనాథ శవాలకు అంత్యక్రియలు

నిజామాబాద్ కల్చరల్, మే1 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలో గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన గుర్తుతెలియని రెండు అనాథ శవాలకు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ గురువారం అంత్యక్రియలు నిర్వహించింది. నాగారంలోని క్రిస్టియన్ స్మశాన వాటిక నందు అనాధ శవానికి క్రిస్టియన్ సాంప్రదాయ పద్దతిలో ప్రార్థనలు చేసి అంత్యక్రియలు నిర్వహించగా మరో అనాధ శవానికి దుబ్బ రోడ్‌లోగల సార్వజనిక్ శ్మశాన వాటికలో హిందూసాంప్రదాయపద్దతిలో అంత్యక్రియలు జరిపారు. ఈకార్యక్రమంలో ఒకటోటౌన్ సీఐ,ఇందూరు యువత స్వచ్ఛందసేవా సంస్థ అధ్యక్షుడు సాయిబాబు,సంస్థప్రతినిధులు,పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు మైనార్టీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యుపిఎస్‌సి పరీక్షల కోసం వంద మంది మైనార్టీలకు ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ అధికారిణి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లీం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్దులు మరియు పార్సీలు దరఖాస్తులు చేసుకోవచ్చని రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33 శాతం సీట్లు, వికలాంగులకు 5 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందని అన్నారు. పూర్తిగా మెరిట్ ప్రతిపాదికన హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. యుపిఎస్‌సి 2026 యొక్క సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రవేశం కోసం డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులు మే 1 నుంచి సీఈటీ.సిజిజి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 24 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని జూన్ 5వ తేదీన అన్ని జిల్లా కేంద్రాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఇతర వివరాలకు 040-23236112, 9700351786 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

హైకోర్టు ఆదాయపు పన్నుశాఖలో జూనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా బండి గణేష్ నియామకం


బండి గణేష్

ఆర్మూర్‌టౌన్,మే 1(ఆంధ్రజ్యోతి): ఆర్థిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఈ విషయం లో ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడేళ్ల పాటు జూనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా కొనసాగుతారు. బండి గణేష్ గత కొన్ని సంవత్సరాలుగా హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. యువ న్యాయవాదిగా, ఆదాయపు పన్ను శాఖకు హైకోర్టులో జూనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా పని చేసే అవకాశం ఆయనకు లభించింది. బండి గణేష్ పదోన్నతిపై గురువారం ఆర్మూర్ ప్రజలు సంతోషం వ్యక్తం చేసి ఆయనను అభినందించారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

భీమ్‌గల్, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెజ్జోర గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 25 ట్రిప్పుల ఇసుకను రెవెన్యూ అధికారులు గతనెల 29న సీజ్ చేశారు. ఇట్టి ఇసుకకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం గురువారం తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్ తహసీల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో మండలానికి చెందిన ఏడుగురు పాల్గొనగా బాబాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ షబ్బీర్ రూ.51 వేలకు వేలం దక్కించుకున్నారు.ఈకార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు మల్లేష్, సాయగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మెండోర ఎస్సైగా యాసిర్ అర్పత్

మెండోర,మే1(ఆంధ్రజ్యోతి):మెండోర ఎస్సైగా యాసిర్ అర్పత్ గురు వారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద టూ టౌన్ నుంచి మెండోర ఎస్సైగా బదిలీపై వచ్చినట్లు తెలిపారు.ఈ సందర్భంగా నూతన ఎస్సైకి పో లీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ సిబ్బంది స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వరద కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య

మోర్తాడ్,మే1(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి చెందిన కత్తికొల్ల గోపి నాథ్ (51)అనే వ్యక్తి వరద కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై విక్రం తెలిపారు.గోపినాథ్‌కు ఎడమకాలు అనారోగ్య సమస్యలతో బాధపడు తున్నాడని, అంతేకాక అతని కూతురు ప్రేమ వివాహం చేసుకొని గొడవల కా రణంగా ఇంట్లోనే ఉండడం వల్ల మనస్తాపం చెంది జీవితంపై విరక్తి చెంది బుధ వారం రాత్రి 10 గంటలకు ఇంటినుంచి వెళ్లి వరద కాలువలో దూకి చని పోయాడని తెలిపారు. గురువారం వరద కాలువలో శవమై తేలడంతో ఆయనను గుర్తించారు. భార్య మానస ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టంకి పంపించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవీపేట,మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామలో గురువారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించారు. గ్రామానికి చెందిన సుమారు 215 తెలుపు, నలుపు జాతి పశువులకు ఈ టీకాలను అందించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య శాఖ సిబ్బంది హుస్సేన్, రవి, గోపాల మిత్ర సిబ్బంది ఉన్నారు.

మాక్లూర్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కిరణ్‌దేశ్‌పాండే కోరారు. గురువారం మండలంలోని వల్లభాపూర్, మెట్‌పల్లి గ్రామాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వినిత, కళ్యాణి, హైమద్‌పాషాతో పాటు రైతులు పాల్గొన్నారు.

గ్రామాలకు చేరని ఇందిరమ్మ ఇళ్ల పథకం

● పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో సైతం పత్తా లేని పనులు ● ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు ● రాములగుట్ట తండాకు 47 ఇళ్లకు అనుమతులు
● అవగాహన కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం ● గ్రామంలో ఆరు ఇళ్లకు ముగ్గుపోయగా ఒకటే ఇల్లు ప్రారంభమైన వైనం

నసురుల్లాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నిరుపేదలకు సొంత ఇల్లు ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సొంత ఇంటి కోసం పేద మధ్య తరగతి వారు ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తూ, సొంత ఇంటి కల నెరవేరుతుంది అన్న ఆశలు ముందుకు సాగడం లేదు. జనవరి 21 నుంచి 25 వరకు జరిగిన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జనవరి 26న పైలెట్ ప్రాజెక్టులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో లబ్దిదారులను ఎంపిక చేసి కలెక్టర్ ఆమోదించి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశిస్తున్నా కూడా నిర్మాణ పనులు ఎక్కడ వేసి గొంగడి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైంది.


రాములగుట్ట తండాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణ పనులు

● నమూనా ఇంటి నిర్మాణంలో అలసత్వం

ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి నిబంధనల ప్రకారం కట్టుకోవడానికి ప్రతీ మండలంలో ఓ నమూనా ఇంటిని నిర్మించనున్నారు. దీంతో పనులు యుద్ధ ప్రాతిపదికన జరిగితే నమూనా ఇంటి నిర్మాణం ప్రకారం నిర్మించుకో వాలన్న ఆలోచనలో లబ్దిదారులు ఉన్నారు. మండలానికి ఒక గ్రామం ఎంపిక చేసి ఆయా గ్రామాల్లో పనులు సాగించాలన్న కూడా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పనులు చేపడుతున్నారు. అదే విధంగా ప్రతి మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నమూనా ఇళ్ల పనులు నత్తనడకన కొనసాగు తున్నాయి.

● జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ ఆమోదం పొందిన ఇళ్లు

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 535 గ్రామసభల్లో 28,653 మంది లబ్దిదారులు సొంతింటి నిర్మాణం కోసం దరఖాస్తుల చేసుకున్నారు. అందుకు ఎల్123గా లబ్దిదారులను విభజించారు. 22 మండలాల్లో ప్రతి మండలం నుంచి ఓ గ్రామాన్ని ఎంపిక చేసి 1672 మందిని కలెక్టర్ ఆమోదించారు. వీరందరికీ ఇంటి నిర్మాణం చేపట్టాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాని నిబంధనలకు తలొగ్గి వెనక్కు తగ్గుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.

ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన కల్పిస్తున్నాం



లబ్దిదారులకు ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. కాని లబ్దిదారులు డబ్బులు లేక కొంత సమయం తీసుకుని ఇళ్ల నిర్మాణం చేపడతామని అంటున్నారు. త్వరలో పైలెట్ ప్రాజెక్టు గ్రామం అయిన రాముల గుట్ట తండాలో ఇంది రమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇల్లు నిర్మించుకోవాలని కోరుతాం.

● సూర్యకాంత్, ఎంపీడీవో, నసురుల్లాబాద్

ఫటా..ఫట్...

నిజాంసాగర్ మండలంలో 86 చెరువులు

●శివప్రసాద్, నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్



చెరువుల అవసరాలను బట్టి వర్షాకాలానికి మరమ్మతులు చేపట్టనున్నట్లు నీటి పారుదల శాఖ అధికారి శివప్రసాద్ ఆంధ్రజ్యోతికి వివరించారు.

ఆంధ్రజ్యోతి: నిజాంసాగర్ మండలంలో నీటిపారుదల శాఖ ఆధీనంలో ఎన్ని చెరువులు కుంటలు పర్లేషన్ ట్యాంకులు ఉన్నాయి ఈ చెరువుల కుంటల కింద ఆయకట్టు ఎంత సాగవుతుంది?

అధికారి: నిజాంసాగర్ మండలంలో 86 చెరువులు, కుంటలతో పాటు పార్క్యులేషన్ ట్యాంకులు ఉన్నాయని పర్లేషన్ ట్యాంకుల్లో నీటి నిల్వలు, కుంటలు కాగా 86 చెరువుకుంటల కింద 3,800 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాకాలంలో పూర్తిస్థాయిలో ఆయకట్టు సాగయిందన్నారు. 65 శాతం మేరకే రైతులు వరితో పాటు వాణిజ్య పంటలు పండించు కున్నారు.

ఆంధ్రజ్యోతి: మండలంలోని చెరువు, కుంటలకు మరమ్మతులు చేయడానికి ప్రణాళిక రూపొందించారా? ఇప్పటి వరకు అత్యవసరంగా ఏదైనా చెరువులను మరమ్మత్తులు చేశారా?

అధికారి: మండలంలో 86 చెరువుల కుంటల గాను అవసరాన్ని బట్టి మరమ్మతుల కోసం ప్రణాళిక రూపొందిస్తాం. ఇప్పటి వరకు సింగీతం గ్రామ శివారులో మీడెక్క చెరువు మూడు లక్షల 40 వేల రూపాయలతో చెరువు అలుగును మరమ్మతులు చేయడం జరిగింది. ఈ చెరువు పూర్తి ఆయకట్టు నాలుగు ఎకరాలు.

ఆంధ్రజ్యోతి: నిజాంసాగర్ ఉమ్మడి మండలంలోని సింగీతం రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారా?

అధికారి: సింగీతం రిజర్వాయర్ మరమ్మతుల కోసం ప్రభుత్వానికి కోటి 75 లక్షల రూపాయల ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఇది రిజర్వాయర్ కిందట 385 ఎకరాలు సాగవుతుంది.

ఆంధ్రజ్యోతి: సింగీతం రిజర్వాయర్ ఎన్ని టీఎంసీల నీటి సామర్థ్యం గల రిజర్వాయర్ అని ఈ ప్రాజెక్టులోనికి ఎన్ని ఎంసి ఏఫ్టీల నీరు ఎగువ నుంచి వస్తుంది?

అధికారి: సంగీతం రిజర్వాయర్ 300 ఎంసీఎఫ్టీల నీటి సామర్థ్యం గల రిజర్వాయర్ అని ఎగువ నుండి వర్షాకాలంలో 600 ఎంసిఏఫ్టీల నీరు వచ్చి చేరుతుందని ఇప్పటి వరకు ఈ రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువ మంజీరా నదిలోనికి ఒక టీఎంసీ నీటిని విడుదల చేసినట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: మండలంలోని చెరువు కుంటల నుండి రైతులకు ఎవరి ఆధ్వర్యంలో సాగునీటిని విడుదల చేస్తున్నారు. నీటిని వృథా కాకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

అధికారి: మండలంలోని చెరువు కుంటల ఆయకట్టుకు నీటి పారుదల శాఖ సిబ్బంది ద్వారానే నీటిని విడుదల చేస్తున్నామని వీఆర్ఏ లు లేనందున సిబ్బంది రైతుల అవసరాన్ని బట్టి నీటిని విడుదల చేస్తూ నీరు వృథా కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నారు.

● (నిజాంసాగర్, ఆంధ్రజ్యోతి)


వృథాగా పోతున్న నీరు

నర్వ పాతచెరువు కాల్వకు బుంగలు

● సైడ్‌వాల్ ధ్వంసం కావడంతో నీరు వృథా
● మరమ్మతులు చేయాలంటున్నరైతులు

మహమ్మద్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వగ్రామంలో గల పాతచెరువు నర్వతూము పంటకాలువ కింద 160 ఎకరాలలో పంటలను రైతులు సాగుచేస్తారు.ఈ కాల్వకు సైడ్ వాల్ పూర్తిగా దెబ్బతినడంతో నీరు వృదాగా వాగులోకి పోతుంది. దీంతో నీరు సరిగా అందక రైతులు దిగుబడి తగ్గుతుందని రైతులు పేర్కోంటున్నారు. చిన్న, సన్నకారు రైతులకు సాగునీరు అందక తీవ్రమైన ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో కూడా ఇలాగే అయితే రైతులు తాత్కలిక మరమ్మతులు చేసుకున్నారు.మట్టిపూర్తిగా కొట్టుకుపోయి వాగులోకి నీరు వృదాగా పోతుందని పేర్కొం టున్నారు. వచ్చేది వర్షాకాలం కావడంతో అధికారులు స్పందిచి కాల్వ మరమ్మతులను చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కాలువ నిర్మాణ పనులు చేపట్టాలి

● రాజేందర్, రైతు

నర్వ పాత చెరువు తూము పూర్తిగా దెబ్బతింది. తూము కింద పంట కాలువ పూర్తిగా చెడిపోవడంతో నీరు వృధాగా వాగులోకి పోతుంది. అధికారులు మరమ్మతులు చేసి వాన కాలం పంటకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలి.


దెబ్బ తిన్న కాల్వ సైడ్‌వాల్

పిచ్చిమొక్కలతో నిండిపోయిన మురికి కాలువలు

పెర్కిట్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని 23వ వార్డులో శ్రీరాంనగర్ కాలనీ, విద్యానగర్ కాలనీల సరిహద్దులో గల ప్రాంతంలో మురికి కాలువలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ఈ మార్గంలో స్థానికులు, పాఠశాలలకు వెళ్లడానికి అధిక సంఖ్యలో సంచరిస్తుంటారు. దారిపక్కనే గల మురికి కాలువ అసంపూర్తిగా నిర్మించబడి ఉండడం వల్ల మురికి నీరు ఒకచోట చేరి పిచ్చిమొక్కలతో నిండిపోయింది. పిచ్చి మొక్కలు దట్టంగా పెరగడంతో ఆ మార్గంగుండా వచ్చేవారికి మురికి కాలువ ఉన్నదని తెలియక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గంలో విద్యుత్ స్తంబాలకు బిగించిన వీధిదీపాలు పనిచేయడం లేదు. రాత్రి సమయంలో ఈ మార్గంలో వెళ్లడానికి చీకటిలో స్థానికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వాహనదారులు చీకటిలో పలుమార్లు మురికి కాలువలోకి దూసుకుపోయి గాయాలపాలయ్యారు. ఈ మార్గం గుండా పాఠశాలలు ఎక్కువగా ఉండడం వల్ల విద్యార్థిని విద్యార్థులు సైకిల్‌మీద వచ్చేవారు తీవ్ర ఇబ్బందులపాలవుతున్నారు. వెంటనే సం బంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న మురికి కాలువను పూర్తిగా శుభ్రం చేసి మరమ్మతులు చేపట్టి, అదేవిదంగా పాడై పోయిన వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


పిచ్చిమొక్కలతో నిండిపోయిన మురికి కాలువలు


అసంపూర్తిగా ఉన్న మురికి కాలువలు

అసంపూర్తిగా ఉన్న మురుగు కాలువ
వెంటనే మరమ్మతులు చేపట్టాలి: రాము, స్థానికుడు

అసంపూర్తిగా మురికి కాలువ ఉండడం వలన ఎగువ నుండి వచ్చే మురికి నీరు ఒకచోట చేరడంతో దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నాం. అదే విధంగా చుట్టు పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి ఉండడంతో అక్కడ మురికి కాలువ ఉన్నది గుర్తించలేకపోతున్నారు. వెంటనే మున్సిపాలిటీ వారు చొరవ తీసుకొని డ్రైనేజీని పూర్తిచేసి మురికి కాలువను వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో నిరసన



పొతంగల్ మండల పరిషత్ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన

కోటగిరి, మే 1 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని పలు కాలనీల్లో తాగునీటి సమస్య తలెత్తడంతో ఆయా కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పొతంగల్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని బాజిరెడ్డి, ఒడ్డెర, ఎస్సీ కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా తలెత్తిందన్నారు. గత కొన్ని నెలల నుంచి కుళాయిల్లో నీళ్లు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. తమ సమస్యను అటు పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించాలని మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంపీడీవో చందర్ తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.

గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిస్తాం

ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి సమావేశానికి రాని వీడీసీ సభ్యులు


ఈత చెట్లను పరిశీలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి


గీత కార్మికులతో మాట్లాడుతున్న అధికారులు

ఏర్గట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి) : గత కొన్ని నెలలుగా తాళ్ల రాంపూర్ గ్రామంలోని గీత కార్మికులను విడీసి మధ్య జరుగుతున్న వివాదాన్ని పరిష్కరించేందుకు అధికారులు గురువారం మండలంలోని తాళ్ల రాంపూర్ గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గీత కార్మికులకు విడీసి సభ్యులతో ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్‌లు సమావేశం ఏర్పాటు చేయగా విడీసి సభ్యులు అందుబాటులో లేకపోవడంతో హాజరు కాలేకపోయారు. ఈ సందర్భంగా అధికారులు గీత కార్మికులకు సంబంధించిన కాలిపోయిన ఈత చెట్లను పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న విషయం చాలా ఉద్రిక్తంగా మారకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, రామాలయంలో మహిళలకు అడ్డుకొన్న వారిపై కేసులు వేయడం జరిగిందని, గౌడ మహిళలు తమకు వీలైన సమయంలో దగ్గరుండి రామాలాయంలో పూజలు చేయిస్తామని ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి తెలుపగా దానికి గౌడ మహిళలు విడీసి రద్దు అయ్యేంత వరకు గుడికి వచ్చేది లేదని స్పష్టం చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా, రెచ్చగొట్టే విధంగా ప్రయత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీడీసీ సభ్యులతో పాటు గీతకార్మికులతో మరోమారు సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కస్తామీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ మల్లయ్య, ఎస్సై రాము, గీత కార్మికలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలి

● తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్



జాన్కంపేట్ చర్చి వార్షికోత్సవంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్

వేల్పూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవా లని తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. గురువారం ఆయన వేల్పూర్ మండలం జాన్కంపెట్ గ్రామంలోని ఇండిపెండెంట్ బాప్టిస్టు చర్చి వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. సమాజంలో అన్ని వర్గాల వారికి కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి ఉపాధి పథకాలు అమలు చేస్తుం దన్నారు. క్రైస్తవులకు అమలు చేస్తున్న పథకాల గురించి తెల్సుకొని ఉపయోగించుకోవాలన్నారు. క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులు సివిల్స్ గ్రూప్, బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ వంటి ఉద్యోగాలు సాధించేందుకు ఉచితంగా శిక్షణ ఇస్తుందన్నారు. సివిల్స్‌లో రెండవ బ్యాచ్ కోచింగ్ ప్రారంభమైందని, కోచింగ్ తీసుకునే వారు ధరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం దీపక్ జాన్‌ను చర్చి తరుపన శాలువతో ఘనంగ సన్మానించారు. ఈ చర్చి వార్షికోత్సవం సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాస్టర్లు మోహన్, నోవాక్, డేవిడ్, ప్రభాకర్, దేవనందం, కాంతాయ్య, అనంతరావు, సునీల్, జీవరత్నం, వివిధ గ్రామాల చర్చిల పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులు నృత్యాలు చేస్తున్న దృశ్యం

తొర్లికొండలో వేసవి సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

జక్రాన్‌పల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొర్లికొండ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా క్రీడ ప్రతాదికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం వేసవి సాఫ్ట్‌బాల్ శిక్షణ శిభిరాన్ని ఎంఈవో శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడల్లో పాల్గొని సాఫ్ట్‌బాల్ శిక్షణ శిభిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణ శిభిరం జూన్ 6వ తేదీవరకు సాయంత్రం ప్రతీరోజు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయమ ఉపాధ్యాయ సంఘం , జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడ్, స్థానిక పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు గంగమోహన్, క్రీడాకారులు , విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


వేసవి సాఫ్ట్‌బాల్ శిక్షణ శిభిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో

నిజాంపూర్ ఎత్తిపోతల పథకం 250 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం


నిజాంపూర్ ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమైన దృశ్యం


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ వినయ్


ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన దిమ్మె

● కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను చోరీ చేసిన దుండగులు

నవీపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిజాంపూర్ ఎత్తిపోతల పథకంకు సంబంధించి 250కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను గత నెల 29న అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను చోరీ చేశారు. ఎస్ఐ వినయ్, స్థానిక రైతులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపూర్ శివారులో గోదావరి నది ఒడ్డున ఉన్న ఎత్తిపోతల పథకం వద్ద రాతి దిమ్మెపై 250కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. నిజాంపూర్, లింగాపూర్, బినోల గ్రామాలకు చెందిన సుమారు 1600ఎకరాల ఆయకట్టుకు ఈ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను దిమ్మెపై నుండి కిందికి దింపి దుండగులు పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఇరిగేషన్ ఏఈ ప్రణయ్ రెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై వినయ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్థానిక రైతుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఏ మాత్రం పని చేయదని నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడానికి సుమారు 6నుండి 8లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. దొంగలను త్వరగా పట్టుకుని వారిని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

పల్లెదవాఖాన పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కాయకల్ప ఇంటర్నల్ ఇంచార్జ్ రమ్య

ఎల్లారెడ్డిరూరల్,మే 1(ఆంధ్రజ్యోతి): పల్లె దవాఖానాలో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కాయకల్ప ఇంటర్నల్ ఇంచార్జ్ రమ్య అన్నారు. గురువారం ఎల్లారెడ్డి మండలంలోని లింగారెడ్డిపేట పల్లె దవాఖానాను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగారెడ్డిపేట పల్లె దవాఖాన పరిధిలోని కళ్యాణి,దేవునిపల్లి, సబ్దల్పూర్,దవల్ మల్కాపల్లి, రేపల్లెవాడ గ్రామాల ప్రజలు పల్లె దవాఖాన సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామస్థాయిలో స్థానికుల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా పల్లె దవాఖానాలో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు నమోదుచేయాలలని లింగారెడ్డిపేట పల్లె దవాఖాన వైద్యులు,సిబ్బందికి సూచించారు. రాష్ట్రవైద్యబృందం కాయకల్ప పరిశీలనకు వచ్చే సమయానికి వైద్యసేవలకు సంబంధించిన రిజిస్టర్‌లు సిద్ధంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో లింగారెడ్డిపేట పల్లె దవాఖాన వైద్యులు శివకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ సచిన్ పాల్గొన్నారు.

రామారెడ్డిలో 43.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

కామారెడ్డిటౌన్,మే 1(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. గడిచిన 24 గంటల్లో రామారెడ్డి 43.9,కొల్లూర్ 43.9,బిచ్కుంద 43.8,బీర్కూర్ 43.6,సర్వాపూర్ 43.6,ఎల్పుగొండ 43.5,జుక్కల్ 43.4,మేనురు 43.2,బీబీపేట 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

కులగణనను పకడ్బందీగా చేపట్టాలి

కామారెడ్డిటౌన్,మే 1(ఆంధ్రజ్యోతి): కులగణనను పకడ్బందీగా చేపట్టాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీలనాగరాజు అన్నారు. ఆలస్యంగానైన కులగణనపై చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు ప్రధానిమోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామనిఅన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని దశాబ్దాలుగా బీసీలు ఉద్యమిస్తున్నారని తెలిపారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ సామాజిక రిజర్వేషన్లకు 50శాతం పరిమితి విధించారని, కులగణన ద్వారా 50శాతం పరిమితి ఎత్తివేసి,ఎవరి జనాభా దామషా ప్రకారం వారికి రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి దయాకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

రేపటి బస్‌భవన్ ముట్టడిని విజయవంతం చేయండి

బాన్సువాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): మే 3న తలపెట్టిన చలో బస్ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గోలి లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎస్‌డబ్ల్యూయూ రాష్ట్ర కార్యదర్శి రాజీవ్‌రెడ్డి ఆదేశానుసారం గురువారం బాన్సువాడ డిపో నుండు మే 3 చలో బస్ భవన్ కరపత్రాలను ఈ సందర్భంగా కరపత్రాలను బాన్సువాడ డిపో ఉద్యోగస్తులకు పంపిణీ చేయడం జరిగింది. ప్రతి ఒక్క కార్మికులు పెద్ద సంఖ్యలో ముట్టడి కార్యక్రమానికి తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి కె.మల్లయ్య, నాయకులు కుమార్ దేవాంగ, ఎంఆర్‌గౌడ్, ఆఫీస్ నసీర్‌ఖదీర్, డిపో ఉద్యోగుస్తులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ

భిక్కనూరు, మే 01(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని ప్రాథమి ఆరోగ్యకేంద్రాన్ని కాయకల్ప బృందం సభ్యురాలు డాక్టర్ సాయి ఈశ్వరీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలు, ఆసుపత్రిలోని సౌకర్యాలు, వార్డులు, ఓపి, రికార్డులు, ల్యాబ్‌లు, ఫార్మసీని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ఓపిని మరింత పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆసుపత్రిలో సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణీ యేమిమా, హెచ్‌ఈవో వెంకటరమణ, ఫార్మాసిస్టు స్వామి, స్టాఫ్ నర్సు హరిత, ల్యాబ్ టెక్నీషియన్ వనశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసన్నపల్లిలో ప్రభుత్వ కళాశాల అడ్మిషన్ డ్రైవ్

భిక్కనూరు, మే 01(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో మెదక్ జిల్లా రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పదవతరగతి పాసైన విద్యార్థుల వద్దకు వెళ్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, తదితర అంశాలపై విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని ఈ సందర్భంగా తల్లిదండ్రులను లెక్చరర్లు కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది స్వామి, యాదగిరి, బాలప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

నెమలి సాయి ఆలయంలో పూజలు



సాయిబాబా విగ్రహం

నసురుల్లాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలంలోని నెమలి ఆలయంలో గురువారం భక్తులు సాయి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ నెమలి సాయి ఆలయం మినీ షిరిడిగా అవతరించిందన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'గ్రామ పంచాయతీ నిర్మాణానికి స్థలాన్ని సేకరించండి'



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో సూర్యకాంత్

నసురుల్లాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలంలో నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి స్థలాన్ని సేకరించాలని పంచాయితీ కార్యదర్శులకు ఎంపీడీవో సూర్యకాంత్ సూచించారు. గురువారం మండలంలోని ఆయా గ్రామ పంచాయితీల సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా మండలంలోని ఆయా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శులకు ఆదేశించారు. అదే విధంగా మండలంలోని నూతనంగా ఏర్పడిన రెండు గ్రామ పంచాయితీలు సంఘం ఎ ఫకీర్ నాయక్ తండా గ్రామాలలో గ్రామ పంచాయితీ నిర్మాణానికి, కంపోస్టు షెడ్ నిర్మాణం కొరకు స్థలాన్ని సేకరించాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయితీ సెక్రటరీలు సవిత, హనుమవ్వ, సరిత, సాయిలు, రజిత, శ్రావణ్, ఫయాజ్, శంకర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మేడే



లింగంపేటలో జెండాను ఎగురవేస్తున్న సీఐటీయు జిల్లా కార్యదర్శి

లింగంపేట, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కార్మికదినం మేడేను లింగంపేట మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కార్మికులు ఐక్యంగా పోరాడాలని, 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చిన చట్టాలను రద్దు చేయాలని, ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సంపూర్ణంగా విజయ వంతం చేస్తామని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాన్య, బాస్కర్, రెడ్డిసింగ్‌లతో పాటు కార్మికులు ఉన్నారు.

రామారెడ్డి : కార్మిక వర్గం పోరాట సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 15 చట్టాల ప్రభుత్వం అడ్రస్ లేకుండా చేస్తుందని మిగతా 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా ఆమోదించి అమలు చేయడం వలన కార్మికులను కట్టు బానిసలుగా మార్చబోతుందని దీనికి వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఎ.ప్రకాష్ కార్మికులకు పిలుపునిచ్చారు. రామారెడ్డి మండల కేంద్రంలో గురువారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. 139 మే డే సందర్భంగా రామారెడ్డి గ్రామ పంచాయితీ కార్మికులతో టీయూసీఐ ఆధ్వర్యంలో అరుణ పతకాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు జి.సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కిషోర్, జిల్లా కోశాధికారి బి.కిషోర్, గ్రామ పంచాయితీ కార్మికులు గంగరాజు, రాజయ్య, సాయిలు, లక్ష్మణ్, కారోబార్ రాజేందర్, శ్రీధర్, శంకర్, రాజేందర్ నాయక్, కార్మికులు లింబవ్వ, బాలరాజవ్వ, పద్మ, శ్రీరామ్, రాజు, శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని తిర్మన్‌పల్లిలో కార్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బాల్‌నర్సు కార్మిక జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మామిళ్లసాయిలు, కార్యదర్శి మల్లేష్, ఉపాధ్యాక్షులు సాయిలు, అంగన్‌వాడి టీచర్స్ సిద్దలక్ష్మీ, లలిత, రజిత,రాజు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ : బాన్సువాడ పట్టణంలోని సీపీఐ, ఏఐటీయూసీ కార్యాలయం వద్ద గురువారం కార్మిక వర్గ పోరాట దినం మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జి, తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాస్ర ఆములు మేడే జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు కార్మికులు ఎనిమది గంటల పని దినం కావాలని, పనికి తగిన వేతనం చెల్లించాలని, వెట్టి చాకిరిని నిర్మూలించాలని కార్మికులను యంత్రాంలాగా కాకుండా మనుషుల్లాగా చూడాలని డిమాండ్‌లతో 1886వ సంవత్సరంలో అమెరికాలోని చికాగో నగరంలో సమ్మె చేస్తున్న కార్మికులపై యజమాన్యాలు పోలీసులతో కార్మికులపై తుపాకీతో కాల్పులు జరపడం వలన ఎంతో మంది అమరులయ్యారని, వారి రక్తంతో తడిసిన గుడ్డలతోనే కార్మికులు ఎర్ర జెండా ఎగురవేశారని ఆయన తెలిపారు. కార్మిక వర్గ పోరాటా ఫలితమే కార్మిక చట్టాలు అమలులోకి వచ్చాయని ఆయన తెలిపారు. ప్రాణ త్యాగాలతో సాధించుక్ను కార్మిక చట్టాలను నేడు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తుందని ఆయన విమర్శించారు. మే డే స్ఫూర్తితో కార్మికుల చట్టాలను కాపాడుట కోసం కార్మికులు ఐక్యంగా ఉండి ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన తెలిపారు. ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి డి.శంకర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తోటపల్లి శ్రీనివాస్, శివాజీ, రాజు, కుమార్ దేవాంగ, కమ్మరి రాములు, కొత్త సాయిలు, గంపల సాయిలు, ఒడ్డు సాయిలు, ఓలిప్ప గంగాధర్, మొగులయ్య హన్మాండ్లు, కృష్ణ, పోశెట్టి, నాగమణి, రాపర్తి సాయిలు, పుట్టి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద : బిచ్కుంద అంబేద్కర్ చౌరస్తా వద్ద కార్మికుల దినోత్సవం మేడే సందర్భంగా గురువారం కార్మికులు జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెమటోడ్చి కష్టపడి పనిచేసే కార్మికులందరికి పనికి తగిన వేతనాలు వర్తించిన నాడే కార్మికుల దినోత్సవానికి అర్థం ఉంటుందని తెలిపారు. కార్మికుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి గ్రామ పంచాయతీ,అంగన్ వాడి లలో పనిచేసేవారికి తగిన వేతనాలు ఇవ్వాలని కార్మికుల నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ,అంగన్‌వాడి కార్మికులు పాల్గొన్నారు.

బాన్సువాడ : ప్రపంచ కఆర్మిక దినోత్సవం మేడే సందర్భంగా గురువారం బోర్లం గ్రామంలో గ్రామ పంచాయితీ కార్మికులు హమాలీ ఆటో కార్మికులు కలిసి గ్రామ కార్మికుల అధ్యక్షులు కమ్మరి రాజయ్య జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోర్లం గ్రామ మాజీ సర్పంచ్ కె.శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రెక్కల కష్టాన్ని నమ్ముకుని శ్రమ జీవిగా కష్టం చేస్తున్న కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్మికుల శ్రమను గౌరవిద్దాం, కార్మికుల శ్రమను గుర్తిద్దాం దేశ కార్మికులందరికీ ఎనిమిది గంటల పనిని పనికి తగ్గట్టు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోర్లం గ్రామ కార్మిక నాయకులు, కార్మికులు సయ్యద్ సులేమాన్ కాదిరెడ్డి, విజయ్, కప్ప సంగమేశ్వర్, మంద నారాయణతో కలిసి రాములు తాటికొండ గంగాఆరం, లింగమల్ల శివవ్వ, మంగలి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ : బాన్సువాడ ఆర్టీసీ డిపోలో గురువారం మే డే ఉత్సవాలు ఉద్యోగస్తులు, కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. జెండా ఎగురవేసి నినాదాలు చేస్తూ మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో బాన్సువాడ డిపో ఎస్‌డబ్ల్యూయూ డిపో సెక్రటరీ కె.మల్లయ్య, రీజినల్ సభ్యులకు కుమార్ దేవాంగ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గోలి లక్ష్మణ్, డిపో ఉద్యోగస్తులు ఎంఆర్‌గౌడ్, ఆఫీస్ ఖదీర్, బీహెచ్‌గౌడ్, గోపాల్, వి.సాయిలు, మోహన్, దుర్గయ్య, డిపో ఉద్యోగస్తులు, కార్మికులు పాల్గొన్నారు.

జుక్కల్ : జుక్కల్ మండల కేంద్రంలో భవన నిర్మాణం కార్మికులు ఘనంగా మే డే వేడుకలు నిర్వహించుకున్నారు. అనంతరం సీఐటీయూ నాయకులు సురేష్ మాట్లాడుతూ భవన కార్మికులకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆయన అన్నారు. కార్మికులకు ప్రభుత్వం ఇన్సురెన్స్ చెల్లించాలని, అదే విధంగా అనారోగ్యానికి గురై కార్మికులకు ప్రభుత్వం హెల్త్ పాలసీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని బీడీ వర్కర్స్ కాలనీలో భవన నిర్మాణ కార్మికులు గురువారం మే డే సందర్భంగా జెండాఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజమైన భవన కార్మికులకు ప్రభుత్వం ఆదుకుని సబ్సిడీ మీద 20 లక్షల లోన్ ఇవ్వాలని 50 సంవత్సరాలు నిండిన వారికి నెలకు ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయిబాబా, ఉపాధ్యక్షుడు సాయిలు, కోశాధికారి దుర్గాని లక్ష్మణ్, కార్యదర్శి గణేష్, కరీం, మహిపాల్, రాము పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్ : ఎంతోమంది కార్మికులు తమ ప్రాణాలను త్యాగం చేసి హక్కులను సాధించుకున్న రోజు మేడేనని సీఐటీయూ జిల్లా నాయకుడు ఖలీల్ అన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మేడే సందర్భంగా .ఎండాను ఆవిష్కరించారు. కార్మికులకు మిఠాయిలను పంచి పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందని మండిపడ్డారు. 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటల పని విధానాన్ని తీసుకరావాలని ప్రభుత్వం చూస్తోందని , అదే జరిగితే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చాంద్ , సాయిలు , అప్సర్ , రాజేష్ ఉన్నారు.

బీర్కూర్ : బీర్కూర్ మండల కేంద్రంలో గురువారం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కామప్ప చౌరస్తాలో కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉన్నప్పుడే పోరాటాలతో తమ సమస్యలను పరిష్కరించుకోగలుగుతారన్నారు.

భిక్కనూరు : మండలకేంద్రంతో పాటుగా మండలంలోని పలు గ్రామాల్లో మేడే దినోత్సవాన్ని సీపీఎం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని భిక్కనూరు మండలకేంద్రం, జంగంపల్లి గ్రామంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కొత్త నర్సింలు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు, కర్షకులు, రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు. చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డి మండల పరిధిలోని మౌలాన్‌ఖేడ్ గ్రామంలో భవననిర్మాణ రంగ కార్మికులు మే డేను పురస్కరించుకుని కార్మికుల జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవననిర్మాణ కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడు సాయిలు, ఉపాధ్యక్షుడు బాబు,ప్రధానకార్యదర్శి బాలరాజ్, రాములు, హనుమంత్, ప్రవీణ్, మహిపాల్, రాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్‌పై విమర్శలు తగవు'



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

నసురుల్లాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): రవీంద్రభారతిలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించడం సరికాదని మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎలక్షన్ మేనిఫెస్టోలో పెట్టిన అమలు కాని హామీలతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా దాని పక్కన పెట్టి తెలంగాణ ప్రజల్ని దృష్టి మళ్ళించడం సరికాదన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలే కాంగ్రెస్ పార్టీకి సమాధి కట్టే రోజులు దగ్గరలో ఉన్నాయని బీఆర్ఎస్ పార్టీ పక్షానా హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుడిసెల నరసింహులు గౌడ్, ఎం.డి.అఫ్రోజ్, టేకుల సాయిలు, లక్ష్మణ్, రాథోడ్ రాజు, సాయిలు, లక్ష్మణ్, వీరేందర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులకు షీల్డ్‌లు అందించి అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నాగిరెడ్డిపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు పది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ అభినందించారు. మోడల్ స్కూల్‌కు చెందిన 33 మంది బాలురు, 63 మంది బాలికలు మొత్తం 96 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా మొత్తం మంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులైయ్యారు. కాగా గురువారం ప్రిన్సిపాల్ పాఠశాలలో పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానించి షీల్డ్‌లు అందించి అభినందించారు. ఇలాగే కష్టపడి చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

పెద్ద కొడప్‌గల్, మే 01 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి గ్రామంలో గురువారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు టీకా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్య శాఖ ఓస్ శ్రీనివాస్ మాట్లాడుతు కాటేపల్లి గ్రామంలో ఉచిత గాలికుంటు టీకాల శిబిరం నిర్వహించామని, ఈ శిబిరంలో 187 ఆవులు, 207 గేదేలకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరిగిందని తె లిపారు.మొత్తం 394 పశువులకు టీకాలు వేశామని తెలిపారు. వేసవి కాలంలో పశువులు వ్యాదులు బారిన పడకూడదనే ఉద్దేశ్యంతో టీకాలు వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర ర వీందర్, గ్రామస్తులు మల్లప్ప పటేల్, గాండ్ల పోచన్న తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సన్మానం

దోమకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి):పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో దోమకొండ మండల కేంద్రంలోని అభ్యుదయ పాఠశాలలో చదివిన సుమయ అనే విద్యార్థి 566 మార్కులతో మండలంలో మొదటి స్థానంలో నిలిచిన సందర్భంగా గురువారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సహయకులు మాణిక్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

రామారెడ్డి, మే 1 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం రెడ్డిపేట్ గ్రామానికి చెందిన దూలం నీరజ - ప్రవీణ్‌లకు కూతురు జన్మించింది. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, గురువారం రామారెడ్డి జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి, రామారెడ్డి మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నర్సాగౌడ్‌తో కలిసి ఆరవై వేల విలువ గల చెక్కును లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రగోతంరెడ్డి, నాయక్, బండి ప్రవీణ్, కుమ్మరి శంకర్, ఎం.డి. ఇర్షాద్, బక్కి సతీష్, మహేష్, కొలకాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య

కామారెడ్డిటౌన్,మే 1(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలంలోని నర్సన్నపల్లి గ్రామంలో చిదురకవిత (40) అనే మహిళను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేసి ఆభరణాలు దోచుకెళ్లినట్లు దేవునిపల్లిఎస్ఐ రాజు తెలిపారు. చిదుర కవిత ఇంట్లో నుంచి బుధవారం బయటకు వెళ్లి సాయంత్రం అయిన ఇంటికి రాలేదు. ఆమె భర్త చిదుర గంగారెడ్డి తన పొలం వద్దకు వెళ్లి చూడగా అనుమానాస్పదస్థితిలో చనిపోయి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. ఆమె మెడకు చీరతో ఉరివేసి హత్యచేయడంతో పాటు ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలను దోచుకొని వెళ్లారని తెలిపారు. మృతురాలి భర్త గంగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వాలీబాల్ శిక్షణా శిబిరం

బాన్సువాడటౌన్ , మే 01 (ఆంధ్రజ్యోతి) : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాన్సువాడ పాఠశాలలో వాలీబాల్ శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు సురేందర్ పీడీ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 6.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని , ఆసక్తి గల 14 సంవత్సరాలలోపు బాలబాలికలు తమ పేర్లను నమోదు చేసుకోవాలని , శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9908370837 నెంబరకు సంప్రదించాలని కోరారు.

పది ఫలితాల్లో రిపుల్స్ విద్యార్థుల ప్రభంజనం

బిచ్కుంద , మే 01 (ఆంధ్రజ్యోతి) : పదవతరగతి పరీక్షా ఫలితాల్లో బిచ్కుంద రిపుల్స్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ మార్కులతో ప్రభంజనం సృష్టించారు. పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత పొందగా పి. సంజయ్ 582/600 , పి. సాయితేజ 572/600 మార్కులను సాధించారు. వీరిని పాఠశాల యాజమాన్యం అనిల్‌కుమార్ పాటిల్ , ప్రిన్సిపాల్ గోపి , ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆగ్రోస్ చైర్మెన్ కాసుల

బాన్సువాడటౌన్ , మే 01 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి మేరకు కేంద్రం కులగణనపై సానుకూల నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

● ఎంపీడీవో మహబూబ్

బీర్కూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగు నీటిఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మహబూబ్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందితో ఎంపీడీవో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చలు చేపట్టారు. గ్రామస్థాయిలో తలెత్తే సమస్యలను ఎలా పరిష్కరించాలి అనే విషయాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో సంబాపూర్ గ్రామపంచాయతీ నూతనంగా ఏర్పడిందన్నారు. గ్రామంలో గ్రామపంచాయతీ భవనం, కంపోస్టు షెడ్ ఏర్పాటు కోసం తహసీల్దార్ ద్వారా స్థల సేకరణ చేపట్టాలని సూచించారు. అంగన్‌వాడీ భవనాలు లేని గ్రామ పంచాయతీలలో స్థల సేకరణ చేయాలని, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు తీర్మానాలు సమర్పించాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ శ్రామికుల సంఖ్య పెంచాల న్నారు. రోజువారిగా వారికి కూలీ డబ్బులు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కూలీల సమయపాలన ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఉపాధి హామీ పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ పైనుంచి దూకి మహిళ ఆత్మహత్య

కామారెడ్డిటౌన్,మే 1(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో నివాసముండే పసుపులేటి పూజిత (18) అనే మహిళ గురువారం రెండస్తుల బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్యచేసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డితెలిపారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంకు చెందిన పూజిత అదేమండలానికి చెందిన సాయితో గత సంవత్సరం ఆగస్టు 24 న వివాహం జరిగిందని తెలపారు. గత కొన్నిరోజుల నుంచి సాయి వేరే ఆమెతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడనే విషయంపై పూజిత సాయిని ప్రశ్నించగా గొడవ జరిగింది. అదేవిధంగా వివాహసమయంలో ఒప్పుకున్న అర ఎకరం భూమి రిజిస్ట్రేషన్‌చేసే విషయంలోను గొడవలు జరిగింది. ఇదేక్రమంలో బుధవారం రాత్రి 10.30గంటలకు మరోమారు ఇద్దరు గొడవ పడ్డారు. ఇది మనస్సులో పెట్టుకున్న పూజిత బిల్డింగ్‌పైనుంచి దూకడంతో తీవ్ర రక్తస్రావమై మృతిచెందింది. మృతురాలి తండ్రి కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఆమె భర్త సాయిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చోరీకి యత్నం... పోలీసులకు అప్పగింత...

బీర్కూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటప్పయ్య క్యాంప్‌లో బుధవారం రాత్రి ఒక ఇంట్లో ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు గమనించి వారిని వెంబడించి పట్టుకున్నారు. చోరీకి పాల్పడ్డ ఇద్దరినీ పోలీసులకు అప్పగించారు. బీర్కూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటప్పయ్య క్యాంప్‌కు చెందిన బంతి బాపిరాజు కుటుంబ సభ్యులతో కలిసి గత ఐదు రోజుల క్రితం ఆంధ్రాకు వెళ్లాడు. అయితే బుధవారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు బాపిరాజు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో వస్తువులు అన్ని చిందర వందరగా పారేశారు. ఇంట్లో కారం పొడి చల్లారు. ఇంట్లో చప్పుడు రావడంతో ఇరుగు, పొరుగు వారు లేచి కేకలు వేశారు. దొంగలు పరార్ అయ్యారు. క్యాంప్‌కు చెందిన కిషోర్ అనే వ్యక్తి వారిని వెంబడించి పట్టుకున్నారు. అయితే చోరీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులు పక్కనే ఉన్న కిష్టాపూర్‌కు చెందిన వారుగా గుర్తించారు. అనంతరం చోరీకి పాల్పడిన ఇద్దరినీ పోలీసులకు అప్పగించారు.